



# కోటిపుంగు

పి. ఆర్. గౌరి

కాంతారావుకు యితర్లని పీడించే స్వభావం వుంది. ఆ స్వభావం వల్ల వచ్చిన బోలెడంత డబ్బుంది. డబ్బువల్ల వచ్చే గర్వముంది. దేవుడంటే చచ్చేంత భయం వుంది.

అందుకే "—ఆయనకి జ్వరం తగ్గితే ఆయన్ని నీ దగ్గరికి పంపి గుండు కొట్టిస్తా" నన్న పెళ్ళాం మొక్కును తీర్చగానికి ఆ రోజు ఉదయం అక్కడికి చేరాడు.

అది ఓ మోస్తరు పట్నం. అక్కడి ఆలయంలోని వెంకటేశ్వరస్వామికి చాలా మహిమ వుందని ప్రతీతి.

ఉదయం దేవుడి గుడిలోకి ప్రవేశించిన వెంటనే కనిపించిన ఓ దృశ్యం అతని మనసును బాగా ఆకర్షించింది.

ఆ ఆవరణలోని పెద్ద గుంజకు మూడేళ్ళ కుర్రాడ్ని కట్టేశారు. ఆ కుర్రాడు గట్టిగా ఏడుస్తున్నా, ఎవరూ పట్టించుకోక పోవడమేగాక, చుట్టూ మూగిన జనమంతా వినోదంగా చూస్తున్నారు.

మామూలుగా అయితే అదంతా కాంతారావుకి బోల్డంత ఆశ్చర్యం కలిగించేదే గాని, ఉదయం బస్సు ప్రయాణంలో సంపాయించిన పరిజ్ఞానంవల్ల ఇప్పుడు సర్దా మాత్రమే వేసి, ఆ గుంపు దగ్గరికిచేరి అందులో ఒకతన్ని అడిగాడు- 'ఈ పిల్లగాడ్ని వేలం వేస్తున్నారా?' అని.

"అవును బాబయ్యా" అన్నాడతను.

ఆ సంభాషణ బానిస వ్యవస్థ కాలంలో రోము, ఏథెన్సు, ఆఫ్రికాఖండాల్లో డబ్బుగలవారు బానిసల్ని వేలం పాడుకొనేప్పుడు వచ్చి మాట్లాడుకొనేంత మామూలుగా జరిగింది! కాని సభ్య సమాజం లబ్బున గగ్గోలుపెట్టేంత దారుణమేమీ జరగల్లేదక్కడ. పోతే - సత్య హరిశ్చంద్రుడంతటి అబ్బురమైన పన్లు చేసేవారూ లేరక్కడ.

"మరేం జరుగుతుందక్కడ?" అంటే- యిదో రకమైన మొక్కు.

పిల్లలు ఎంతకీ పుట్టని వారు, యీ దేవాలయం లోని దేవుడికి, "తమకు పుట్టించే వక్షంలో, ఆ పిలల్ని తెచ్చి, ఆ దేవుడి సమక్షంలోనే వేలంవేసి, ఆ డబ్బు దేవుడికి సమర్పిస్తామని" మొక్కుకుంటుంటారు. ప్రస్తుత మక్కడ అలాటి తంతే జరుగుతోంది.

ఇలాటి కార్యక్రమం గురించి ఉదయం బస్సులో వస్తూ విన్నాడు కాంతారావు తనతోపాటే యిదే వూరికి వస్తూన్న ప్రయాణీకుల వద్దనించి. మాటల సందర్భంలో వాళ్ళు తమకు ఈ విధమైన మొక్కు వున్నట్లు, దాన్ని తీర్చుకోడానికే వస్తున్నట్లు చెప్పారు. మొట్టమొదటిసారిగా యిలాటి విషయాన్ని విన్న కాంతారావు—

"మరి యింకెవరైనా ఆ కుర్రాణ్ని వేలం పాడుకొంటే ఎట్లా?" అనడిగాడు.

"ఇంకెవరైనా ఎందుకు పాడుకొంటారు? మేమే ఎంతో కొంతకు కొనుక్కున్నట్లు పాడి, ఆ డబ్బే హుండీలో వేసేస్తాం" అన్నాడు వారిలో ఒకడు.

"ఇంకెవరైనా వేలం పాడితే" అని రెట్టించాడు కాంతారావు.

"ఎందుకు పాడతారు! అయినా మేమీ విషయం అందరికీ చెప్పే వేలం మొదలెడతాం."

"ఇంకెవరైనా పోటీగా పాడితే?" అని పట్టుపట్టాడు కాంతారావు.

"ముందరే చెబుతాం స్వామీ! ఎవరినీ పోటీలో చేరి పాట పెంచొద్దని.... కాళ్ళు పట్టుకొంటాం కావాలంటే."

"అయినా యింకెవరైనా పాడితే?" అనే పిడివాదం వదల్లేదు మన పరపీడకుడు.

"ఏంజేస్తాం, ఆ పాడే వెధవకన్నా ఎక్కువకు వేలంలో కొని ఆ డబ్బు హుండీలో వేస్తాం, ఛస్తామా?" అన్నాడు వాళ్ళలో ఒకడు విసుగ్గా.

వాడి విసుగు చూసి కాంతారావుకు చిర్రెత్తింది. జేబులోంచి ఓ నోటకట్ట తీసి ప్రయాణీకులకు ప్రదర్శిస్తూ లెక్కపెట్ట సాగాడు.

దాంతో వేలం మొక్కు పెట్టుకొన్న వెర్రివాళ్ళకు కించిత్ భయంవేసి "మీరు మాత్రం వేలంలో జేరకండే!" అని ప్రాధేయపడ్డారు కాంతారావును.

కాంతారావు "అలా అడగండి! లేకుంటే మీ వెంటే వచ్చి, మీ కుర్రాడ్ని వేలంకొనేసేవాడ్నే! అలా చేస్తేగాని మీ మొక్కులో బండారం బయటపడదు నిజానికి" అని విలాసంగా నవ్వి, డబ్బు జేబులో పెట్టుకున్నాడు.

"బాబ్బాబు" అన్నారు వాళ్ళు.

"సరే సరే" అని వాళ్ళ మీద దయ తలాచాడు కాంతారావు.

సరే—యిప్పుడు వాళ్ళేనేమో, ఈ వేలం వేసే వారని చూశాడు కాంతారావు. కానీ వాళ్ళుకాదు.

అదేం ఖర్మో కాంతారావు రాకకోసమే అంతసేపూ ఆగినట్లు, వేలం ప్రారంభమైంది.

ఒక ముసలతను జనంముందు నించొని "పీశ్నా మనవడు..కొడుక్కి- కొడుకెంత కాలం పుట్టకపోతే, ఈ వేలం మొక్కు- పెట్టుకొన్నాం దేవుడికి....సత్యం గల దేవుడు పుట్టించాడు! యిది మొక్కే-గాని వేలంకాదు. మీరెవరూ దయచేసి పాట పెంచొద్దు-" అని చెప్పి-దేవుడిపాటగా(!) "వంద రూపాయలు" అన్నాడు.

"నూటొక్క-రూపాయి" అన్నాడు కుర్రాడి మేనమామనని చెప్పుకొనే అతను.

"నూట పదహారుకి ఫైసల్" అనేశాడు తాత. కుర్రాడి కట్లు విప్పడానిక్క-దుల్తూ.

అంతదాకా వర్గాగ్గా చూస్తున్న కాంతారావుకి దేవుడికి ఎక్కు-వ డబ్బు ముట్టేలా చేద్దామని బుద్ధి పుట్టింది. వెంటనే—

"నూటిరవై రూపాయలు" అన్నాడు.

కుర్రాడి తాత చిరునవ్వుతో కాంతారావును చూసి "నూటాయాభై ఒంది రూపాయలు — చాలు" అన్నాడు.

"రెండొందలు" అన్నాడు కాంతారావు గంభీరంగా.

కుర్రాడి తాతా, తండ్రీ, మేనమామా వులిక్కి-పడ్డారు. జనానికి కూడా వినోదం పెరిగింది.

కుర్రాడి తాత "రెండొందలొక్క-రూపాయి-" అని అర్చి.— "బాబ్బాబు! ముందే చెప్పాగా- ఎంత దేవుడికే అయినా అంతకన్నా యిచ్చే తాహతు మాకులేదు. పోటీకి రాకండి" అన్నాడు కాంతారావుతో.

"అయిదొందలు!" అన్నాడు కాంతారావు.

మరుక్షణం కుర్రాడి తండ్రి చెప్పు విడిచి పట్టుకొని కాంతారావు పైకివచ్చాడు.

కాని కుర్రాడి తాత అతన్నాపి "దేవుడి మొక్కు-....అనవసరంగా అభాసు చేయకు" అని చెప్పాడు.

ఆ కుర్రాడి మేనమామ కాంతారావు చేతులు పట్టుకొని-"అయ్యా! మాలాంటి బీదోళ్ళతో ఆటలాడకండి. మీకంటే ఎక్కు-వ పాడాల్సిన అవసరం మాకుంది గదాని. పాట పెంచకండి. ఎగ్గొట్టాని కూ-డా మాకువీల్లేదు. సత్యంగలదేవుడికి మొక్కు-. ఇంతటితో మమ్మల్ని వదిలేసి మీదార్న మీరు పొండి—" అని

"అయిదొందల ఒకటికి పాడ్రా అర్జాయ్" అన్నాడు కుర్రాడి తండ్రితో.

అర్జాయ్ కోపాన్ని దిగమింగి, అయిదొందల ఒకటికి పాడాడు.

"రెండు వేల రూపాయలు" అన్నాడు మొండిగా కాంతారావు.

ఈసారి కాంత స్వభావులైన ఆ కుర్రాడి తాతా, మేనమామలక్కూ-డా కోపం వచ్చింది. జనానికి ఈ వినోదం రంజుగా వుంది. వేలం పెట్టబడ్డ కుర్రాడి తాలూకు ముగ్గురి దగ్గరా కలిపినా రెండు వేల రూపాయల్లేవు.

"ఆడికి పాటొగ్గెయ్‌రా! ఆడి దగ్గర రెండు వేలా తీసుకొని, పోరడ్నిచ్చెయ్! ఆడ్నేం చేసుకొంటాడో చూసా" అర్చాడు.

పాట రెండువేల రూపాయలకు వదిలేయబడింది.

కాంతారావుకి మతి పోయింది.

"అయింది వెధవ పని! దేవుడివిషయం రెండువేలూ యివ్వకుంటే రేవటికలా ఢామ్మని ఛస్తాడు" అన్నాడు జనంలోంచి ఒకడు.

ఢామ్మనేకాదు, మరే యితర శబ్దంతో చచ్చినాసరే రెండువేలు యివ్వకుండా వుండేవాడే కాంతారావు. కానీ—అతని అతి తెలివికి—"కుర్రాడి బంధువులు రెండువేల కోసం కక్కు-ర్తిపడరు ప్రస్తుతానికి బెట్టుచేసినా, కాసేపటికి తన కాళ్ళు, వేళ్ళు పడతారు. అప్పుడు తను మూడు వేలు డిమాండు చేయొచ్చు" అనిపించింది.

రెండు వేల రూపాయల నోట్లు కరకర మనిపిస్తూ వాళ్ళ చేతుల్లో ధీమాగా పోశాడు కాంతారావు.

"యేం భయం లేదుర్రా బుజ్జీ" అని ఆ ముగ్గురూ కుర్రాడికి ధైర్యం చెప్పి ఎటో వెళ్ళిపోయారు.

"ఇప్పుడేమౌతుంది?" అని హిచ్ కాక్ ఫిల్మ్ చూసున్నప్పటికంటే ఎక్కువే సస్పెన్సు ఫీలయ్యారు జనం.

"నలుగురు రౌడీల్ని తెచ్చి, వీడి బుర్ర రామకీర్తన పాడించి కుర్రాడ్ని తీసి కెళ్తారు" అని జనంలోంచి ఒకడు క్లయిమాక్సు ఊహించాడు.

అది విన్న కాంతారావు క్కా-స్త భయం వేసింది. అయినా వెంటనే పోలీసుల్నీ, భారతీయ శిక్షాస్మృతిని జ్ఞాపకం తెచ్చుకొని నిభాయించుకొన్నాడు.

కుర్రాడి యేడుపు తారాస్థాయి నందుకొంది. వాడికి ఏడుపేగాని మాటల్రావులా వుంది!

కాంతారావు వాడి కట్లు విప్పి, పటిక బెల్లం వాడి నోట్లోపెట్టి. వాడ్ని వాళ్ళో కూర్చోబెట్టుకొని, పిల్లవాడి బంధువుల కోసం, మూడు వేల రూపాయల కోసం ఎదురుచూడసాగాడు. జనం గూండాల కోసం, కొట్లాటకోసం ఓ గంటసేపు ఎదురుచూసి ఎవరిదార్న వారు వెళ్ళిపోసాగారు.

ఇంతలో ఎవరో యిద్దరు దంపతులు, ఒక పోలీసెస్పై, యిద్దరు కానిస్టేబుల్సు గుడిలోకి ప్రవేశించారు.

"అదుగో!" చూపింది ఆడావిడ, కాంతారావు వొడిలోని కుర్రాడ్ని.

అప్పటికే పల్చబడ్డ జనం, యిప్పుడిక ఒక్కడూ లేకుండా అక్కడ్నించి జారుకొన్నారు.

పోలీసులు కాంతారావును చుట్టుముట్టారు.

"వీడేనా?" అడిగాడు యస్సై కాంతారావును చూపిస్తూ.

"ఏమో! పిల్లగాడ్ని గబుక్కున చేతుల్లోంచి లాక్కొని పురుగుతుంటే, ఆ ఖంగారులో సరిగ్గా చూడనే లేదు.... వెధవ....ఎంత నిటుగా వున్నాడో! పిల్లల్నెత్తుకొచ్చే ఖర్మేంటి వీడికి!" అరుస్తొంది ఆడావిడ.

కుర్రాడ్ని, వాడి అసలు తండ్రి ఎత్తేసుకొని ముద్దాడుతున్నాడు.

బస్సులో కాంతారావు ప్రేలాపనలు విన్న ప్రయాణీకులెవరో యీ కుర్రాడ్ని ఎత్తుకొచ్చి పురాతనమైన నమ్మకానికి ఆధునిక ఆలోచనను మరేసి రెండువేలు కాజేశారన్నమాట.

ఆ విషయం కాంతారావుకి అర్థమైంది గాని, పోలీసులు అర్థం చేసుకొని నమ్మలేదు.

వాళ్ళని నమ్మించేసరికి ఇంకా చాలా నసపడ్డాడు కాంతారావు! స్వగ్రామం చేరేసరికి కాంతారావుకు తాతలనాడే బోడి గుండు మాత్రమే మిగిలింది. ●

